సమస్యల పరిష్కారానికి ప్రత్యేక వేదిక

- అన్ని ట్రాన్స్‌కో కార్యాలయాల్లో ఏర్పాటు
- సరైన ప్రచారం లేక సద్వినియోగం చేసుకోని విద్యుత్ వినియోగదారులు

మిర్యాలగూడ పట్టణానికి చెందిన విశ్వనాథుల రామాచారికి రెండు గదుల ఇల్లు ఉంది. అతడికి ప్రతి నెలా కరెంట్ బిల్లు రూ.300 కంటే ఎక్కువ వచ్చేది కాదు. కానీ ఓసారి ఏకంగా రూ.9,149 విద్యుత్ బిల్లు వచ్చింది. ఇదేమి అని అడిగితే బిల్లు కట్టవలసిందే అని అధికారులు మొదట చెప్పారు. ఏఈ దృష్టికి తీసుకెళ్తే దరఖాస్తు రాసి ఇవ్వమని చెప్పారు. నాలుగు నెలలు దాటినా ఎవరూ స్పందించలేదు. తన సమస్య ఎవరికి చెప్పుకోవాలో అర్థంకాని అతడు అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.


మిర్యాలగూడలో ఫిర్యాదులు అందజేస్తున్న విద్యుత్ వినియోగదారులు (ఫైల్)

మిర్యాలగూడ అర్బన్: ఇటీవల విద్యుత్ సరఫరాలో అనేక అవాంతరాలు, సమస్యలు తలెత్తుతుండటం .. ఆ సమస్యల పరిష్కారానికి ట్రాన్స్‌కో కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా.. ఎంతకూ పరిష్కారం కాకపోవడంతో విద్యుత్ వినియోగదారులు తమ సమస్య పరిష్కారం కోసం అధికారులకు అమ్యామ్యాలు ఇచ్చుకుని పనులు చేయించుకోవలసిన పరిస్థితి నెలకొంది. దీంతో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారానికి విద్యుత్ సంస్థ ప్రత్యేకంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న ట్రాన్స్‌కో కార్యాలయాల్లో పరిష్కార వేదికలను ఏర్పాటు చేసింది. వీటి పనితీరుపై వినియోగదారులకు సరైన అవగాహన లేకపోవడంతో సంవత్సరాల తరబడి తమ సమస్యల పరిష్కారానికి ట్రాన్స్‌కో కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు.

పరిష్కరించే సమస్యలు ..

వ్యవసాయ పంపుసెట్ల సామర్థ్యం వినియోగం పెంపు, రకరకాల విద్యుత్ బిల్లుల సమస్యలు, రైతుల ట్రాన్స్‌ఫార్మర్లలో సమస్యలు, ట్రాన్స్‌ఫార్మర్ ఓవర్ లోడ్ లోవోల్టేజీ, విరిగిన విద్యుత్ స్తంభాలు, కొత్త సర్వీసులు ఇవ్వడానికి నిరాకరించడం, జాప్యం చేయడం, పేరు బదిలీ, సర్వీసు కేటగిరీ మార్పు, నూతన ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు వంటి సమస్యలు పరిష్కారం కాకపోతే ఈ పరిష్కార వేదికలో ఫిర్యాదు చేయవచ్చు.

ఫిర్యాదు చేయాలి ఇలా..

సమస్యను ఓ కాగితంపై రాసి ఏదైనా గుర్తింపు కార్డును జతచేసి పోస్టు, మెయిల్ లేదా వెబ్‌సైట్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు. వచ్చిన ఫిర్యాదులను నలుగురు సభ్యులు గల సమస్యల పరిష్కార వేదిక బృందం పరిశీలించి ఆ సమస్యపై నివేదిక ఇవ్వాలని సంబంధిత అధికారులను ఆదేశిస్తారు. నివేదిక వచ్చిన తర్వాత కోర్టు హాల్‌లో ఫిర్యాదుదారుడు, సంబంధిత అధికారి సమక్షంలో విచారణ చేసి సమస్యను పరిష్కరించవలసిందిగా ఆ అధికారికి కొంత సమయం ఇస్తారు. ఆ సమయంలోపు సమస్య పరిష్కారం కాకపోతే సంబంధిత అధికారికి జరిమానా సైతం విధించే అధికారం వేదికకు ఉంటుంది. సమస్య పరిష్కారమయ్యాక వినియోగదారుడు సంతృప్తి చెందకపోతే విద్యుత్ అంబుడ్స్‌మెన్ ఫోరానికి వెళ్లవచ్చు. కాగా వేదిక ఏర్పాటుపై సరైన ప్రచారం నిర్వహించకపోవడంతో చాలా మంది విద్యుత్ వినియోగదారులు తెలియకపో ఈ వేదికలు అలంకారప్రాయంగా మారాయని పలువురు ఆరోపిస్తున్నారు.

ప్రజలు ఉపయోగించుకోవాలి



పెండింగ్‌లో ఉన్న విద్యుత్ సమస్యల పరిష్కారానికి విద్యుత్ సంస్థ సమస్యల పరిష్కార వేదికను ఏర్పాటుచేసింది. వినియోగదారులు వ్యక్తిగతంగా, పోస్టు ద్వారా, వెబ్‌సైట్ ద్వారా ఫిర్యాదులు చేయవచ్చు. ఈ అవకాశాన్ని ప్రజలు ఉపయోగించుకోవాలి. సూర్యాపేట, హుజూర్‌నగర్, దేవరకొండ, భువనగిరి, చౌటుప్పల్, మిర్యాలగూడ డివిజన్లలో ప్రత్యేక ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమాలు పూర్తయ్యాయి.

– కె. దిలీప్‌కుమార్, విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక చైర్మన్

‘కంటి వెలుగు’ను సద్వినియోగం చేసుకోవాలి

- దేవరకొండ ఎమ్మెల్యే రవీంద్రకుమార్

దేవరకొండ: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. బుధవారం పట్టణంలోని 10వ వార్డులో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. సంపూర్ణ అంధత్వ నిర్మూలనే లక్ష్యంగా ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని పేర్కొన్నారు. అర్హులందరూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ కృష్ణకుమారి, మున్సిపల్ వైస్ చైర్మన్ రహత్ అలీ, కమిషనర్ వెంకటయ్య, హన్మంతు వెంకటేష్‌గౌడ్, జయప్రకాష్, ఎన్‌వీటీ, పున్న వెంకటేశ్వర్లు, రయిస్, పొన్నెబోయిన సైదులు, చిత్రం ప్రదీప్, తౌఫిక్ తదితరులున్నారు.


కళ్లద్దాలు అందజేస్తున్న ఎమ్మెల్యే రవీంద్రకుమార్

పేదల జీవితాల్లో వెలుగులు నింపిన కేసీఆర్

- నాగార్జునసాగర్ ఎమ్మెల్యే భగత్

హాలియా: రాష్ట్రంలోని అన్నివర్గాలకు సంక్షేమ ఫలాలను అందించి పేదల జీవితాల్లో వెలుగులు నింపిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని నాగార్జునసాగర్ ఎమ్మెల్యే నోముల భగత్ అన్నారు. బుధవారం హాలియా పట్టణంలోని లక్ష్మీనరసింహ గార్డెన్‌లో నిర్వహించిన బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. హాలియా మున్సిపాలిటీలో రూ.40కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. జానారెడ్డి హయాంలో ప్రభుత్వ భూములు కబ్జాకు గురయ్యాయని, దీంతో నేడు హాలియా మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు చేపడదామంటే ప్రభుత్వ భూమి దొరకని పరిస్థితి నెలకొందని విమర్శించారు. మాజీ ఎమ్మెల్యేలు గుండెబోయిన రాంమూర్తి, నోముల నరసింహయ్య ఎమ్మెల్యేలుగా ఉన్నప్పుడే సాగర్ నియోజకవర్గం అభివృద్ధి చెందిందన్నారు. బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు చెరుపల్లి ముత్యాలు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ ఇరిగి పెద్దులు, ఆప్కాబ్ మాజీ చైర్మన్ యడవెల్లి విజయేందర్‌రెడ్డి, హాలియా మున్సిపల్ చైర్‌పర్సన్ వెంపటి పార్వతమ్మశంకరయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్లు జవ్వాజి వెంకటేశ్వర్లు, మర్ల చంద్రారెడ్డి, పెద్దవూర జెడ్పీటీసీ అబ్బిడి కృష్ణారెడ్డి, బీఆర్‌ఎస్ వివిధ మండలాల అధ్యక్షులు కూరాకుల వెంకటేశ్వర్లు, పిడిగం నాగయ్య, తాటి సత్యపాల్, రవినాయక్ తదితరులు పాల్గొన్నారు.


ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నోముల భగత్

బీఆర్‌ఎస్ పార్టీకి కార్యకర్తలే బలం


మాట్లాడుతున్న శ్రీధర్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే భాస్కర్‌రావు


ఆత్మీయ సమ్మేళనానికి హాజరైన బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు

- రాష్ట్ర విద్య, సంక్షేమాభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ శ్రీధర్‌రెడ్డి, ఎమ్మెల్యే భాస్కర్‌రావు

మిర్యాలగూడ: కార్యకర్తలే బీఆర్‌ఎస్ పార్టీకి బలమని రాష్ట్ర విద్య, సంక్షేమాభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ శ్రీధర్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణ శివారులోని నందిపహాడ్‌లో మిర్యాలగూడ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు అధ్యక్షతన నిర్వహించిన ఆత్మీయ సమ్మేళన సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కార్యకర్తలు ఇప్పటి నుంచే వచ్చే అసెంబ్లీ ఎన్నికలకు సిద్ధం కావాలన్నారు. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై విమర్శలు చేస్తున్న ప్రతిపక్ష పార్టీల నాయకుల కుట్రలను కార్యకర్తలు ఎండగట్టాలన్నారు. వచ్చే ఎన్నికల్లో మరోసారి మిర్యాలగూడ ఎమ్మెల్యేగా నల్లమోతు భాస్కర్‌రావును భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

రైతుల సంక్షేమానికి బీఆర్‌ఎస్ కృషి

దేశంలోని రైతులందరి సంక్షేమం కోసమే సీఎం కేసీఆర్ బీఆర్‌ఎస్ పార్టీని స్థాపించినట్లు ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు అన్నారు. రైతుబంధు, రైతుబీమా, ఉచిత విద్యుత్ వంటి పథకాలను దేశంలోని అనేక రాష్ట్రాల ప్రజలు తమకు కూడా కావాలని కోరుకుంటున్నారని పేర్కొన్నారు. అనంతరం శ్రీధర్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆగ్రోస్ కార్పొరేషన్ చైర్మన్ తిప్పన విజయసింహారెడ్డి, జిల్లా రైతుబంధు సమితి అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఎన్‌బీఆర్ ఫౌండేషన్ చైర్మన్ నల్లమోతు సిద్ధార్థ, ఎంపీపీ నూకల సరళాహన్మంతరెడ్డి, బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి నాగార్జునచారి, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు వెంకటరమణచౌదరి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చిట్టిబాబనాయక్, మాజీ ఎంపీపీ పేలప్రోలు తిరుపతమ్మ, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, వివిధ గ్రామశాఖ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

న్యాయం జరిగే వరకు పోరాడుతాం

హాలియా: రాష్ట్రంలోని నిరుద్యోగులకు న్యాయం జరిగేంత వరకు బహుజన సమాజ్ పార్టీ(బీఎస్పీ) తరఫున పోరాడుతామని ఆ పార్టీ నాగార్జునసాగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదిమల్ల వెంకటేష్ అన్నారు. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ అక్రమ అరెస్టును నిరసిస్తూ బుధవారం పట్టణంలో ఆ పార్టీ నేతలు నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ.. టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వం టీఎస్‌పీఎస్సీ చైర్మన్ జనార్దన్‌రెడ్డిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. రాష్ట్రంలోని నిరుద్యోగులకు న్యాయం జరగాలని వారికి అండగా నిలబడిన బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను అక్రమంగా అరెస్టు చేయడం సరికాదని అన్నారు. పార్టీ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు బత్తుల ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నియోజకవర్గ జనరల్ సెక్రటరీ సత్యనారాయణరాజ్, అనుముల, పెద్దవూర, గుర్రంపోడు మండలాల అధ్యక్షులు జిల్లా మధు, ముత్యాలు, రమేష్, హజారిగూడెం గ్రామ అధ్యక్షుడు ఏర్పుల నాగరాజు, తక్కెళ్లపల్లి సైదులు తదితరులు పాల్గొన్నారు.


హాలియాలో దీక్ష చేస్తున్న బీఎస్పీ నేతలు

కాంగ్రెస్ బలోపేతానికి కృషిచేయాలి

దేవరకొండ: నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషిచేయాలని జాతీయ యువజన కాంగ్రెస్ కార్యదర్శి, యూత్ జోడో– బూత్ జోడో కార్యక్రమ ఇన్‌చార్జి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. బుధవారం దేవరకొండలో యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు కిన్నెర హరికృష్ణ అధ్యక్షతన జరిగిన నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. యూత్ జోడో– బూత్ జోడో కార్యక్రమంలో భాగంగా గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన సంక్షేమ పథకాలను యువజన కాంగ్రెస్ నాయకులు ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. అనంతరం నియోజకవర్గ యూత్ జోడో– బూత్ జోడో ఇన్‌చార్జ్ నేనావత్ ప్రవళిక మాట్లాడారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జూలూరి ధనలక్ష్మి, యువజన కాంగ్రెస్ జిల్లా కార్యదర్శులు కొర్ర రాంసింగ్, లక్ష్మితిరుపతి, జిల్లా, నియోజకవర్గ కార్యవర్గ సభ్యులు, వివిధ మండలాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

దేవరకొండ: మున్సిపాలిటీ పరిధిలోని 1వ వార్డులో బుధవారం ఏర్పాటు చేసిన ఉచిత ఆయుష్ వైద్య శిబిరాన్ని వార్డు కౌన్సిలర్ పొన్నెబోయిన భూదేవిసైదులు ప్రారంభించి మాట్లాడారు. ప్రజలు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పలువురికి షుగర్, కీళ్ల నొప్పులు, జీర్ణ కోశ వ్యాధులకు సంబంధించి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు ఊర్మిళ, మెహ్రాజ్ షహీన్, ఫారుఖీ, పుష్పలత, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న హాథ్ సే హాథ్ జోడో యాత్ర


బీఎల్‌ఆర్ పాదయాత్రకు స్వాగతం పలుకుతున్న కాంగ్రెస్ నాయకులు

వేములపల్లి: మిర్యాలగూడ మున్సిపల్ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ బత్తుల లక్ష్మారెడ్డి(బీఎల్‌ఆర్) చేపట్టిన హాథ్ సే హాథ్ జోడో పాదయాత్ర బుధవారం మండలంలోని రావులపెంట, మొల్కపట్నం, మంగాపురం, సల్కునూరు గ్రామాల్లో కొనసాగింది. ఈ సందర్భంగా బీఎల్‌ఆర్ మాట్లాడుతూ.. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజలను, నిరుద్యోగులను ఆవేదనకు గురిచేస్తుందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సామాన్యుల కడుపుకొట్టి దేశ సంపదను అంబానీ, అదానీలకు దోచిపెడుతుందన్నారు. మిర్యాలగూడ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ద్వారా లబ్ధి పొందిన వారిని స్థానిక బీఆర్‌ఎస్ నేతలు ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు. పార్టీ ఆదేశానుసారం నియోజకవర్గ టికెట్ ఎవరికి దక్కినా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలంతా సైనికుల్లా పనిచేసి గెలిపించుకుంటారని, తమ మధ్య వైరుధ్యాలకు తావులేదన్నారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తమ్మడబోయిన అర్జున్, వేములపల్లి ఎంపీపీ పుట్టల సునీతాకృపయ్య, డీసీసీ ఉపాధ్యక్షుడు రావు ఎల్లారెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు పుట్టల శ్రీను, బీసీ సెల్ నాయకులు పల్లా వెంకటయ్య, కాంగ్రెస్ నాయకులు బీరెల్లి సతీష్‌రెడ్డి, శీలం శ్రీనివాస్, బుసిరెడ్డి వెంకట్‌రెడ్డి, తమ్మడబోయిన రామన్న తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం


స్వపరిపాలన దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

పెద్దవూర: మండల కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో బుధవారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులుగా, ఉన్నతాధికారులుగా వ్యవహరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ధీరావత్ బాలోజీ, హెచ్‌డబ్ల్యూఓ కొల్లు బాలకృష్ణ, ఉపాధ్యాయులు కూన్‌రెడ్డి రాంరెడ్డి, ఎండీ. షబ్బీర్, బి. కృష్ణ, డి. శ్రీనునాయక్, సైదులునాయక్, షాహీన్‌బేగం, రామయ్య, శాంతి, కన్వర్‌లాల్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత


ప్రతిజ్ఞ చేస్తున్న మున్సిపల్ కమిషనర్ వెంకటయ్య తదితరులు

దేవరకొండ: పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత అని మున్సిపల్ కమిషనర్ వెంకటయ్య అన్నారు. స్వచ్ఛోత్సవ్ కార్యక్రమంలో భాగంగా బుధవారం మహిళా సంఘాల సభ్యులతో కలిసి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. తడి, పొడి చెత్తను వేరు చేసి మున్సిపల్ సిబ్బందికి అందించాలని అన్నారు. అనంతరం స్వచ్ఛోత్సవ్ ప్రతిజ్ఞ నిర్వహించారు. కార్యక్రమంలో పర్యావరణ ఇంజనీర్ సక్రూనాయక్, మున్సిపల్, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

నిడమనూరు: మండలంలోని ఎర్రబెల్లి గ్రామానికి చెందిన కొట్టె లింగయ్యయాదవ్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. బుధవారం లింగయ్యయాదవ్ కుటుంబ సభ్యులను ఎన్‌ఆర్‌ఐ, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు మన్నెం రంజిత్‌యాదవ్ పరామర్శించి రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట సర్పంచ్ అలుగుబెల్లి మమతాకోటిరెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ సిరిగిరి శ్రీనివాసరెడ్డి, వట్టికోట నాగయ్య, శంకర్, వెంకన్నయాదవ్, సైదులు, లాలయ్య, వెంకటరమణ, శివ, గురువయ్య, ఉపేందర్, లింగయ్య పాల్గొన్నారు.


లింగయ్యయాదవ్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మన్నెం రంజిత్‌యాదవ్

విద్యార్థులు పరీక్షలంటే ఆందోళన చెందొద్దు

హాలియా: పదో తరగతి విద్యార్థులు ఎలాంటి ఆందోళన చెందకుండా, ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలని మండలంలోని చింతగూడెం జెడ్పీహెచ్‌ఎస్ ప్రధానోపాధ్యాయుడు అబ్బిరెడ్డి వేమారెడ్డి అన్నారు. బుధవారం చింతగూడెం జెడ్పీహెచ్‌ఎస్‌లో తొమ్మిదో తరగతి విద్యార్థులు పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ.. పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని అన్నారు. ప్రణాళికబద్ధంగా చదివితే మంచి ఫలితాలు వస్తాయని పేర్కొన్నారు. పరీక్షల సమయంలో విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురికావొద్దని సూచించారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పాఠశాల పూర్వ విద్యార్థి వట్టికోటి హరీష్ పదో తరగతి విద్యార్థులకు ఉచితంగా పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గడ్డం శ్యాంప్రసాద్, ఎండీ పాషా, పురం వెంకటయ్య, సాగర్ల సత్తయ్య, పేర్ల వెంకటేశ్వర్లు, దూసరి మధు, ఈగల లింగయ్య, శ్రీనివాస్, సుజాత పాల్గొన్నారు.


వీడ్కోలు సమావేశంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

పరీక్ష ప్యాడ్‌ల పంపిణీ


దామరచర్ల జెడ్పీహెచ్‌ఎస్‌లో పరీక్ష ప్యాడ్‌లు అందజేస్తున్న సోనియా సక్రు సేవాసమితి సభ్యులు

అడవిదేవులపల్లి: దామరచర్ల మండలంలోని పార్దు నాయక్ తండాకు చెందిన సంగారెడ్డి జిల్లా కలెక్టర్ శరత్, ఆయన సోదరులచే నిర్వహించబడుతున్న సోనియా సక్రు సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో 10వ తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులు, పెన్సిళ్లు అందజేశారు. కార్యక్రమంలో సేవా సమితి చైర్మన్ ఆడావత్ జైత్రాంనాయక్, వైస్ చైర్మన్ ఆడావత్ శశిధర్, పార్దునాయక్ తండా సర్పంచ్ ఆడావత్ ఆనంద్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

దామరచర్ల మండలంలో..

మిర్యాలగూడ: దామరచర్ల మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌తో పాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టళ్లలోని పదో తరగతి విద్యార్థులకు ఎస్‌ఎస్‌ఎస్ సేవా సమితి సభ్యులు పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులు పంపిణీ చేశారు. సంగారెడ్డి కలెక్టర్ శరత్ సహకారంలో పరీక్ష ప్యాడ్‌లు అందించినట్లు సేవా సమితి చైర్మన్ జయత్రాం నాయక్ తెలిపారు. కార్యక్రమంలో శశిధర్‌నాయక్, మట్టపల్లి శ్రీధర్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలి

మిర్యాలగూడ టౌన్: పదో తరగతి విద్యార్థులు కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని రిటైర్డ్ టీచర్, మాజీ సర్పంచ్ మారం భిక్షమయ్య, హైదరాబాద్‌కు చెందిన సీనియర్ జర్నలిస్టు జూలూరి పుండరీచారి అన్నారు. బుధవారం మండలంలోని తడకమళ్లలో జెడ్పీహెచ్‌ఎస్‌లో గ్రామానికి చెందిన పోలోజు వీరభద్రం జ్ఞాపకార్థం 10వ తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులు తదితర సామగ్రి పంపిణీ చేశారు. అనంతరం 10వ తరగతి విద్యార్థులకు 9వ తరగతి విద్యార్థులు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. విద్యార్థులు చేసిన నృత్యాలు పలువురిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మాజీ ఎస్‌ఎంసీ చైర్మన్ అనంతుల యాదగిరిగౌడ్, ప్రధానోపాధ్యాయుడు సాంబశివరావు, ఉపాధ్యాయులు పండిట్ రెడ్డి, భీమా, భిక్షమయ్య, కవిత, పద్మ పాల్గొన్నారు.


తడకమళ్ల జెడ్పీహెచ్‌ఎస్‌లో పరీక్ష ప్యాడ్‌లు అందజేస్తున్న జూలూరి పుండరీచారి తదితరులు

పీఏసీఎస్‌లో అవకతవకలపై విచారణ

వేములపల్లి: మండల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో అవకతవకలు జరిగినట్లు పీఏసీఎస్ కార్యవర్గ సభ్యులు కలెక్టర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం పీఏసీఎస్ అసిస్టెంట్ సబ్ రిజిస్ట్రార్ రాంబాయి విచారణ చేపట్టారు. సంఘం చైర్మన్, వైస్ చైర్మన్‌లు అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని, ఎరువుల విక్రయాల్లో అవకతవకలు జరిగాయని, కార్యవర్గ సమావేశ తీర్మానంలో ప్రైవేట్ వ్యక్తి సంతకం చేశారని, వరుసగా మూడు సార్లు సమావేశానికి హాజరుకాని సభ్యుడిపై చర్యలు తీసుకోలేదని గత నెలలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు విచారణ చేపట్టిన పీఏసీఎస్ అసిస్టెంట్ సబ్ రిజిస్ట్రార్ రాంబాయి మాట్లాడుతూ.. సభ్యులు చేసిన ఫిర్యాదులు వాస్తవమేనని విచారణలో తేలిందని ఈ విషయాలపై ఉన్నతాధికారులకు నివేదిక పంపించనున్నట్లు తెలిపారు.

యాద్గార్‌పల్లిలో ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం


మొక్కను నాటి ఎన్‌ఎస్‌ఎస్ స్పెషల్ క్యాంపును ప్రారంభిస్తున్న సర్పంచ్ తదితరులు

మిర్యాలగూడ అర్బన్: పట్టణంలోని కేఎన్‌ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్–1 ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని యాద్గార్‌పల్లి గ్రామంలో స్పెషల్ క్యాంపు ఏర్పాటు చేశారు. గ్రామంలో వారం రోజుల పాటు నిర్వహించే సామాజిక సేవా కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ దుండిగల యాదమ్మ మొక్కను నాటి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. జాతీయ సేవా పథకంలో భాగంగా గ్రామీణ ప్రాంత ప్రజలకు సేవా కార్యక్రమాలు చేయడం హర్షనీయమని, జాతీయ సమైక్యత సాధించడంలో యువత పాత్ర కీలకమని అన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ టి. వెంకటరమణ, ఎంపీటీసీ వెంకటమ్మ, వెంకట మహేశ్వర్, వెంకటేశ్వర్లు, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ నర్సింగ్ కోటయ్య, నరేష్, వెంకన్న తదితరులున్నారు.

క్లుప్తంగా

తెగుళ్లు సోకిన వరి పొలాల పరిశీలన


పాములపహాడ్‌లో వరి పొలాన్ని పరిశీలిస్తున్న ఏఈఓ స్వాతి తదితరులు

మాడుగులపల్లి: మండలంలోని పాములపహాడ్ గ్రామంలో తెగుళ్ల బారిన పడిన వరి పొలాలను బుధవారం ఏఈఓ స్వాతి పరిశీలించారు. మెడ విరుపు, పాముపొడ, పొట్టకుళ్లు, రెక్కల పురుగు ఉధృతి అధికంగా ఉన్నట్లు గుర్తించారు. మెడ విరుపు నివారణకు ట్రైసైక్లోజోల్, పాముపొడ నివారణకు ప్రొపికోనజోల్, రెక్కల పురుగు నివారణకు ప్రొఫినోఫాస్ మందును లీటర్ నీటికి 2.5 గ్రాముల చొప్పున కలిసి పిచికారీ చేసుకోవాలని రైతులకు సూచించారు. సుమారు 30ఎకరాల్లో 25 శాతానికిపైగా పంట దెబ్బతిన్నట్లు తెలిపారు. సాగులో సస్యరక్షణ చర్యలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ యాతం లక్ష్మీనరేందర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఫుడ్ ఫెస్టివల్


విద్యార్థులు తయారుచేసిన వంటలను పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ రవికుమార్

హాలియా: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ తరఫున కళాశాలకు చెందిన అర్థశాస్త్ర అధ్యాపకురాలు కవిత ఆధ్వర్యంలో నిర్వహించిన ఫుడ్ ఫెస్టివల్ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులు స్వయంగా తయారుచేసిన వివిధ రకాల వంటకాలను ప్రదర్శించారు. ఆయా వంటకాల్లోని పోషక విలువల గురించి వివరించారు. ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు కళాశాల ప్రిన్సిపాల్ రవికుమార్ బహుతులు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

క్రీడలతో స్నేహభావం పెంపొందుతుంది

కొండమల్లేపల్లి: క్రీడలతో స్నేహభావం పెంపొందుతుందని కొండమల్లేపల్లి ఎస్‌ఐ శ్రీనివాసులు అన్నారు. మండల కేంద్రంలోని బైపాస్ రోడ్డు వద్ద గల పశువుల సంత సమీపంలో రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను బుధవారం ఎస్‌ఐ ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంత క్రీడాకారులు తమలోని క్రీడా నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ వీరబాబు, పస్నూరి యుగంధర్‌రెడ్డి, బహుమతి దాతలు పంగ సురేష్, బూడిద మల్లేష్, టోర్నమెంట్ నిర్వాహకుడు మురళి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన నామినేషన్ల ప్రక్రియ


నామినేషన్ వేస్తున్న న్యాయవాదులు

మిర్యాలగూడ టౌన్: మిర్యాలగూడ బార్ అసోసియేషన్ ఎన్నికలు ఏప్రిల్ 3వ తేదీన నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. బుధవారం సాయంత్రంతో నామినేషన్ల ప్రక్రియ పూర్తయిందని ఎన్నికల అధికారి ఏచూరి శ్రీనివాస్, అసిస్టెంట్ ఎన్నికల అధికారులు రడపంగ సతీష్, మంద సైదులు తెలిపారు. 31వ తేదీ సాయంత్రం 5గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉందన్నారు. ఏప్రిల్ 3వ తేదీన ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు ఓటింగ్ నిర్వహించి, అదే రోజు సాయంత్రం ఓట్ల లెక్కింపు చేపట్టి నూతన కార్యవర్గాన్ని ప్రకటించనున్నట్లు తెలిపారు.

నేడు సీతారాముల కల్యాణం

కొండమల్లేపల్లి: మండల కేంద్రంలోని శ్రీసీతారామాంజనేయ చంద్రమౌళీశ్వర మహా అయ్యప్ప దేవస్థానంలో శ్రీరామనవమిని పురస్కరించుకొని గురువారం సీతారాముల కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షులు నాయిని మాధవరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై సీతారాముల కల్యాణాన్ని తిలకించాలని కోరారు.

ముస్తాబైన రామాలయాలు

నాగార్జునసాగర్: శ్రీరామనవమిని పురస్కరించుకుని గురువారం నిర్వహించనున్న సీతారాముల కల్యాణోత్సవానికి నందికొండ మున్సిపాలిటీలోని పలు రామాలయాలు ముస్తాబయ్యాయి. హిల్‌కాలనీలోని కెనాల్స్ ఆంజనేయస్వామి ఆలయంలో, రమాసహిత సత్యనారాయణస్వామి ఆలయంలో, పైలాన్ కాలనీలోని రామాలయంలో, సురికి ఆంజనేయస్వామి ఆలయంలో కల్యాణోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆయా ఆలయాల నిర్వాహకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.